కథానిక :

# కడాపటి ఎండుకొమ్మ

శ్రీ కవికొండల వెంకటరావు

తనువూ తరువూ ఒకలాగే ఎదిగేని అను కొనేలా కొన్నాళ్లు కోమలంగానే అగ పించేవాడు ఆ చెట్టుక్రింద ఆతగాడు. ఆత గాడి పేరు బహూత్ ఆనందగళ్! ఏ దేశం నుంచివచ్చి యీ దేశంలో పర్యటిస్తున్నాడో ఎవ్వరికీ తెలియదు. కొందరి మతంలో ఉత్త రాదిబిడ్డగా దోచేవాడు. కొందఱిమతంలో— అరవబిడ్డగా దోచేవాడు. కొందరిమతంలో ఆసేతు హిమాచలం వ్యాప్తమైయున్న చెప్పన్న రక్తనాళాల రక్తం అతనిలోనే వున్నాయి అనేవారు. ఇంతకూ రూపం ఏర్పడి గర్భరూపం వెలువడ్డాక ఎవరంత వారు వారు. దాన్నే వ్యక్తిత్వం అంటారు. ఆ స్వరూపాన్ని మళ్ళీ ఎంచి, కొంచడంవుండే అది సంకుచితస్వభావం. ఇంతకూ "నీ పేరెవరు?" అని అడిగితే సమాధాన మొచ్చేవి "బహూత్ ఆనందగళ్" అని. ఇంకేం కావాలి మనకు? ఒక మనిషి, ఆ మనిషికో పేరు తయారయ్యె! అని చాలదూ పెద్దకథ అతగాణ్ణిగురించి వ్రాయడానికి?

బహూత్ ఆనందగళ్ లోకానికి తెలి యబడసాగింది తాను ముసీలివాడయ్యాకే! అందాకా "ఎక్కడ నీ కాపురం?" అని అడిగితే "ఇక్కడే!" అనేవాడు; కాని "ఇక్కడ!" అని అతడు చూపినచోటున ఒక గున్నమామిడిచెట్టు లేచిం దతనిచుట్టూ తోరణం కట్టినట్టు. ఆకుపచ్చని కొమ్మ లతో, ఒక్కొక్కవ్వుడు గుబాళించే పరిమ ళించే పువ్వులతో, పిలైనప్పుడల్లా కాయతో పండుతో, ఎడతెరిపిలేని చోద్యం చూపె డుతూ, "బహూత్ ఆనందగళ్" తనచాయ నున్నాడని చాటేదే కాదు. బహూత్ ఆనంద గళ్ కూడా ఆ చెట్టుయొక్క నిశ్వాసమే తన నిశ్వాసంగా, ఆచెట్టునీడనుగూరుచుండి, ఆ చెట్టు గాలి పీలుస్తూ చైతన్యం కలిగివుండే వాడు చెట్టుతో సరిసమానంగా సజీవుడై.

కానైతే చెట్టుకూ మనిషికీ ఒక తేడా వుంది. చెట్టు ఏటేటా ఆకురాలి, అదో అలవాటన్నట్టు, తోడ్తో చిగురోసుకుంటూ, ఎప్పటికప్పుడు చిగురుచేత చిఱుతగా, అప్పటికప్పుడు పుట్టినట్టుగా లేలేతగా అగు పిస్తూనే పైకి మూనై లేచిపోతుంది. మనిషి ఆలాకాదు. వాని బాహ్యస్వరూపం, బాల యౌవన కౌమార వార్ధక్యావస్థలనన్నింటినీ

వేఱువేఱుగా నిరూపించి పారేస్తుంది. చిన్నప్పుడున్న నేవళీకం యౌవనమప్పు డుండదు. యౌవనమప్పుడున్న ఉద్రేకం కౌమార మప్పు డుండదు. కౌమార మప్పు డున్న కార్యదీక్ష వార్ధక్య మప్పు డుండదు. మఱి వార్ధక్య మప్పుడుండే నిరర్థక వ్యాపారత్వము మఱెన్నడూ వుండదు. చెట్టో? చెట్లల్లా కాదు. ఏ ఏటా చిగురుపట్టి, ఏ ఏటా పూతపూసి, ఏ ఏటా కాస్తుంది, తాను బ్రతికున్నన్నాళ్లూ. మళ్ళీ ఎత్తూ ఏపూ ఎక్కణ్ణుంచి వస్తాయో, కొండంత ఎత్తు, కొత్త రూపం ప్రతిపాదిస్తూనూ వుంటుంది.

*     *     *

పోనీ కథలో మన మనుకునే చెట్టు ఎదిగి ఎండిపోయిందనే అని అనుకొందాం! మఱిక ఇగిరిపోవడానికి అందులో పస ఏమీ లేదని వో నిర్ధారణకు వచ్చాం అని అనుకోండి.—వెలుపల పెఱిగే చెట్లమాట? అవి ఒకదానిమీద వొకటి బలిసి, తీగల జొంపాలతో పెనేసుకుపోయి, పురుగు ప్రాకడానిక్కూడా ఎడంలేకుండా, వనం వామనం ఏకరూపమూ అన్నట్టు కాబడతాయే!

ఎందుకూ? వ్రాస్తూ వ్రాస్తూ పెఱటివైపు పరకాయించాను. ఆ పెఱట్లో మామిడిచెట్టు, మామిడిచెట్టును చేరి దబ్బమొక్క, దబ్బమొక్కమీద కెగబ్రాకి విరజాజితీగ, విరజాజితీగ చెంతనే చేతికొక్కాయలందేలా కాసిన చెన్నంగి కొబ్బరిచెట్టు! ఇందులో ఏ వొక్కదాన్ని విడదీసి చూడ్డానికి వల్ల కాదన్నంత పచ్చి పచ్చందనం. చూడముచ్చటేసింది! నా కాపాళంగా కలం క్రిందపడేసి ఓ నిమేషం అటువైపు చూడబుద్ధి వేసింది—

అంతలో మళ్ళీ ఏదో వ్రాస్తూవున్నానన్న సంగతి జ్ఞాపకం వచ్చి కథలోని మ్రానునుగురించి, మనిషిని గురించి యోచిస్తున్నానుగదా—మ్రాను మ్రాను నిలువునా, ఈ లోకాన్ని దిగవిడిచి యేమైందో అన్నట్టు, మాయమై వూరుకుంది. అంత ఎత్తుచెట్టూ వేరునుండి పేరుదాకా ఊహించి అనుకోవలసి వచ్చింది, "ఎక్కడున్నాం మనం? ఏ చెట్టుక్రింద వున్నాం?" అని—అసలు చెట్టే లేదక్కడ!—అలాగంటే ఆ మనిషికి కోపం! ఆ మనిషే మాఱిపోయే వున్నాడు శతవృద్ధు అయి! కాని అక్కడే కూర్చుని వున్నాడు—పేరడిగితే, "బహూత్ ఆనంద్ గళ్" అని అంటూ.

బహూత్ ఆనందగళ్ నేనీ కథ వ్రాసే సరికి ముసీలివాడై యుండడమే కాకుండా మౌనంకూడా దాల్చాడు. ఇఖతణ్ణి ఏమడిగినా లాభం లేదని చుట్టూ పరకాయించాను. చెట్టు వుండే పట్టు, పట్టుమీది ఆకాశం అంతా ఒఠిఖాళీగా కాపడింది. "ఇక్కడ ఓ

చెట్టు వుండేదే?" అన్నాను ముసీలతణ్ణి అడిగినట్టూ కాకుండా అడగనట్టూ కాకుండా! "ఈ చెట్టా?" అన్నట్టు, ఒక విత్తనం, టెంకలాంటిదాన్ని చూపించాడు ఆ వృద్ధు. ముసీలిమనిషిలో, ఏదో ఒకరకంగా ప్రత్యుత్తరం, ఆడేపాళపు చైతన్యం వుందికదా అని సంతోషించాను. "టెంక, మామిడి టెంకా?" అన్నాను. అతడు ఆ టెంకను మోసేపాళపు బలం కూడా లేనివాడె వున్నాడు. టెంక పైకెత్తి ఆలా సాచినకొద్దీ అతగాడి వ్రేళ్లు కొంకర్లు పోసాగాయి. నేను ఆ టెంక నందుకుంటూ "ఇది మామిడి టెంకేను!" అన్నాను. అతగాడు "కాబోలు" అన్నట్టుగాను, చెట్టు అక్కడుంటే, ఎండుదున్నా, దాన్ని జేర్లబడేలాగూ జరిగాడు. ఒరిగిన ఆమనిషికి నేలే తగిలింది కాని చెట్టు తగల్లేదు. తగలడానికి చెట్టంటూ వుంటేగా అక్కడ? కథలో అంతాఖాళీ!

* * *

పెఱట్లో వేఱువంకచూస్తే దడి. దడిమీదకో పొట్టికాకరపాదు,. ఇటూ అటూ పాకి, చిక్కగా పాకి, కాయలు కొన్ని పండి ఎఱ్ఱగా కనిపిస్తూవుంటే, కొన్ని ఆకు చాటున కాపడకుండా పసరుమయంగా ఇఱుక్కుపోసాగాయి. పువ్వులు పసుప్పచ్చగా విప్పారి నక్షత్రాల్లా అసంఖ్యాకాలు పొడగట్టజొచ్చాయి. — "కంటి చూపున కింత చేటు క్రమ స్వరూపమే కథలో అంతఖాళీయేమా?" యని ఒకింత విమర్శించాను. ఆలా విమర్శిస్తూనే కలం మళ్ళీ పోనిచ్చాను కాగితం వెంబడి. కథలో ఈమాటు మనిషి వ్యక్తికూడా అగోచర మయ్యాడు. కథకంతకూ ఆధారశేషంగా నా అరచేతిలో ఆ విత్తనపు టెంకమాత్రమే మిగిలి వుంది. దానిమీద అడిగాను దారేపోయే వాళ్ళను, "ఈ టెంక పాత్తే చెట్టవుతుందా?" అని. ఊసుపోక అడుగుతున్నానని బాటసారుల వూహా! సత్యము తెలిసికోవాలని నా వూహా! ఒక్కళ్ళూ జవాబు చెప్పిన పాపాన్ని పోలేదు.

"చెట్టయితే కావచ్చునుగాని మఱి మనిషిమాత్రం మళ్లీ కనబడడు." అంది ఆకాశవాణి. ఆకాశవాణిని కూడా ధిక్కరించి వెంటనే అన్నాను "మనిషిమాత్రం ఎందుకు కనబడడు?" అని. అంటూ నేనలాగే వున్నాను నా చేతిలో ఆ టెంక కూడా మాయమై ఊరుకుంది.

* * *

మళ్ళీ పెఱటికేసి చూచాను. ఈమాటు పచారుగా మరోప్రక్కకు వెళ్ళి చూచాను. అక్కడ తోటమాలి దోరువులోంచి నీళ్లు మోస్తూ క్రోటను కుండీల్లో పోస్తున్నాడు. "అయ్యగారు కథ ఏమాత్రం పొడుగు వ్రాశారు?" అని అన్నాడు ఆ తోటమాలి. నేను కథలో జరిగిన సంగతి

అంతా చెప్పాను వానితో. "టెంక కూడా మాయమైందిటండీ?" అని ఆశ్చర్యపోసాగాడు.

"ఏమి అలా ఆశ్చర్యపోతున్నావు?" అన్నాను. "ఆ టెంకండి! బాబూ! పెద్ద అయ్యగారు వెనకటి తరంలో తరిగి పారేసిన పండు తాలూకుదండి!" అన్నాడు. "ముసీలివాడు?" అని ప్రశ్నించాను. "వాడు పెద్దఅయ్యగారి తోటమాలీ అండి" అన్నాడు. "అక్కడుండే చెట్టు?" అని అడిగాను. "అదే ఎలుకకు రాకుండా వుంది. ముదిచెట్టు! ముదిచెట్టు!" అని జ్ఞాపకం చేసుకుంటూవున్నట్టుగా అభినయించాడు. "టెంకగల చెట్టు కాబట్టి మామిడిచెట్టు అయియుండాలి" అని అన్నాను నేను. "మామిడి చెట్టేలెండి. పుల్ల మామిడా? తియ్యమామిడా? అని యోచించేను." అన్నాడు వాడు గొంతు సవరించుకుంటూ. "టెంకేది చిన్న బాబులూ!" అని అడిగాడు. "చూచేవా! టెంక యింకా ఎక్కడుందిరా? అప్పుడే మాయమైపోయింది!" అన్నాను ఏదో నిజంగా నా చేతికి వచ్చినట్టు, అది నిలబడకుండా మాయమైపోయినట్టు. "టెంకంటూ వుంటేశాన! తిరుగ పాతేస్తే తెలిసిపోతది, పండేతలికి, పులుపో తీపో." అన్నాడు, కావడి బుజాన్ని మార్చుకుంటూ మా నిజం తోటమాలి. కథలో ముసీలి తోటమాలి మటీ వాటం సెడి మాయమైనట్టు అయిపోయాడు. హారతి కర్పూరం హారించిపోయినట్టు హారించిపోయాడు అని అనుకోండి పాఠకులు! ఒక్క అతడన్నమాటేమిటి? కథలో చెట్టు, టెంక, అన్నీకూడా మాయమై పోయినాయి. మళ్ళీ కనబడలే!

* * *

అయితే కొన్నాళ్ళకో కోమలరసాలాన్ని రోడ్డు ప్రక్కన చూచాను. నా చేతిలోనే టెంక మొలిచిందా అని అన్నట్టు ఇట్టే ముట్టుకు చూచాను. లేలేతగా మనస్సుకు తట్టడమే కాకుండా, చిగురు చేతికి తగలడమేకాకుండా, ఎఱ్ఱగా కంటికికూడా కనిపించింది. ఇఖ దానిమీదకో కోయిలవాలి గానం చేయడమే తరువాయి అని అనిపించింది.

ఇలా వుండగా ఆ గున్నమామిడి చెట్టు కొమ్మల్లో ఒక కోలాహాలం వినిపించింది, గానానికి బదులు. ఏమిటా అని చూస్తును గదా, ఎండు పుడుకలతో పేర్చిన ఒక కాకిగూడు. ఆ కాకిగూడులో, పగిలీ పగలడంలో "కు! కు! కు!" అని అంటూవున్న ఒక కోయిలగుడ్డు. ఆగుడ్డు కూనను కాలితో తన్ని చెదరగొట్టి పారేస్తూవున్న ఒక కాకి. గమ్మున తప్పెట కొట్టాను. తల్లి కాకీ కోయిలపిల్లా రెండూ కూడా ఎగిరిపోతూ బులబులాగ్గా పేర్చబడ్డ గూడును నేలకు పడగొట్టి పారేశాయి.

ఆ గూడును చూస్తునుగదా అది అంతా ఎండుపుల్లల్తో నిర్మాణం అయివుంది. ఈ లేలేత మృదుమధుర రసాలమీదకీ ఎండుపుల్లలగూడెలా వచ్చిందా? అన్నది వెంటనే పెద్దసమస్య అయిపోయినది నాలో నాకు. పుల్లకుపుల్ల విడదీసి చూచాను. అవి అన్నీ పుల్లలు కావు. అవి మనిషి ఎముకలు. మాంసం, మజ్జ, అంతా పోయి అతితేలికగా వున్నాయి. ఆ ఎముకల్తోపాటు ఒక ఎండు రెమ్మ వుంది. అప్పు డనుకున్నాను ఆ ముసీలివాని ఎముకలు ఆ మామిడి చెట్టుయొక్క కడాపటి ఎండు కొమ్మ, అవే అని. ఎముకలు కావు అవీ పుల్లలే అంటారా? అదీ నాకు సమ్మతమే! కథలో ఏమంటే ఏమి కాదు?

*  *  *  *

ఎన్నైనా కావచ్చుగాని తిరుగచూచిన ఆ లేలేత రసాలం మాత్రం నా చేతినుండి మాయమైన విత్తనమువల్ల మొలిచిందనడానికి ఒప్పుకున్నాడు కాదు, మా నిజం తోటమాలి. అప్పు డన్నాను, "ప్రాఁజెట్టు విత్తనం వెళ్ళి స్వర్గంలో కల్పవృక్షమైం" దని. "హాహాహా!" అని నవ్వాడు వాడు నీళ్లు మొక్కలకు దొడదొడా పోస్తూ. కాని కడాపటి ఎండుకొమ్మమాత్రం నవ్వ లేకపోయింది. పువ్వు పూయలేకపోయింది. గూడు ఎప్పుడైతే చెడిపోయిందో అప్పుడే విడిపోయింది. ఆదాకా చెట్టునే వున్నా ననుకుంది పాపం!

